క్లుప్తంగా

ఆర్టీసీ కార్గోను ఆదరించండి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఆర్టీసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్గో సేవలను ఆదరించాలని జిల్లా ఇన్‌చార్జి ప్రజా రవాణా అధికారి ఎన్‌వీ ఆర్ వరప్రసాద్ కోరా రు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఏలూ రు జిల్లా వ్యాప్తంగా కార్గో డోర్ డెలివరీ మాసోత్సవాలు నిర్వహిస్తున్న సందర్భంగా శుక్రవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం డిసెంబర్ నెలలో ప్రయాణికులు, క్రిస్మస్, నూతన సంవత్సర, సంక్రాంతి సందర్భంగా బంధువులు, మిత్రులు, శ్రేయోభిలాషులకు పంపే బహుమతులు కార్గో ద్వారా పంపాలని కోరారు. ఈ నెల 20 నుంచి జనవరి 19 వరకూ కేజీ నుంచి 50 కేజీల వరకు కిలో మీటర్ నుంచి పది కిలోమీటర్ల వరకు ఉచిత డోర్ డెలివరీ సౌకర్యం అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. కారుణ్య నియామకం కింద 9 మందికి ఎంపిక ప్రక్రియ జరిగిందని త్వరలో వారికి ఉద్యోగ బాధ్యతలు అప్పగిస్తామని వివరించారు. ఏలూరు డిపో మేనేజర్ బీ వాణి, కార్గో కమర్షియల్ మేనేజర్ జీఎల్‌పీవీ సుబ్బారావు, ఏఓ వి.నరసింహమూర్తి, పీఆర్‌ఓ కేఎల్‌వీ నరసింహం పాల్గొన్నారు.

ఇంధన పొదుపు అందరి బాధ్యత


బహుమతులు అందుకున్న విద్యార్థులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): విద్యుత్ పొదుపు అందరి బాధ్యతని జిల్లా సూపరింటెండింగ్ ఇంజినీర్ పి.సాల్మన్ రాజు పాల్గొని అన్నారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల ముగింపు కార్యక్రమం స్థానిక విద్యుత్ భవన్లో శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సాల్మన్ రాజు పాల్గొని మాట్లాడారు. సభాధ్యక్షుడు ఏలూరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కేఎం అంబేద్కర్ ఇంధన పొదుపు ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. ఇటీవల నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖనం పోటీల్లో విజేతలైన వివిధ పాఠశాలల విద్యార్థులకు బహుమతులను, సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో ఈఈ టెక్నికల్ పి.రాధాకృష్ణ, ఏడీఈ టౌన్ టి.రాజ్ కుమార్, ఏఈలు ప్రసన్న వల్లి, కె.వెంకటేశ్వరరావు, యూనియన్ నాయకులు తురగా రామకృష్ణ, ఎస్ బలుసు బాబు, ఏజీ సత్యనారాయణ, ఎం విజయ్, ఆర్ భరత్, జి.శంకర్ తదితరులు పాల్గొన్నారు.

23న అభయాంజనేయ స్వామి హుండీ లెక్కింపు

పెదపాడు : ఈనెల 23న అప్పనవీడులోని అభయాంజనేయస్వామి హుండీ లెక్కింపు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ కె శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. సోమవారం ఉదయం 9 గంటలకు నిర్వహించిన ఈ హుండీ లెక్కింపులో పాల్గొనదలచిన, ఆసక్తిగల భక్తులు పాల్గొనాలని కోరారు.

పేదల కాలనీల్లో పనుల నిలిపివేత

- ఫైప్‌లైన్ పనులకు బ్రేక్
- మంజూరుకాని ఇళ్లు
- నిధులు పక్కదారి
- లబ్ధిదారుల్లో ఆందోళన


జాలిపూడి జగనన్న కాలనీ

ఏలూరు రూరల్: కూటమి ప్రభుత్వం పేదల వ్యతిరేక విధానాలను అవలంబిస్తోంది. వైఎస్సార్ సీపీ హయాంలో రూపుదిద్దుకున్న కాలనీల్లో అభివృద్ధి పనులను ఒక్కొక్కటిగా నిలిపేస్తోంది. కొత్త ఇళ్ల మంజూరు చేయడం లేదు. పాత ఇళ్లకు సకాలంలో బిల్లులు చెల్లించడం లేదు. కాలనీల్లో రోడ్లు, విద్యుత్ పనులకు బ్రేక్ వేసింది. వైఎస్సార్ సీపీ హయాంలో మంజూరైన నిధులను పక్కదారి పట్టిస్తోందని తెలిసింది. కొద్దివారాల క్రితం జగనన్న కాలనీల్లో తాగునీటి పైప్‌లైన్ పనులు నిలిపేయాలని, 50 శాతం దాటిన పనులు మాత్రమే కొనసాగించాలని అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. ఫలితంగా దెందులూరు నియోజకవర్గంలోని 132 జగనన్న కాలనీల్లో చేపట్టిన తాగునీటి పైప్‌లైన్ పనులు నిలిచిపోయాయి. ఏలూరు రూరల్ మండలం పైడిచింతపాడు, శ్రీపర్రు, మొండికోడు, ప్రత్తికోళ్లలంక తదితర గ్రామాల్లోని జగనన్న కాలనీల్లో ఇళ్లు నిర్మించుకున్న పేదలకు తాగునీరు సరఫరా ప్రశ్నార్థకంగా మారింది.

నాడు వేగంగా అభివృద్ధి

వైఎస్సార్ సీపీ హయాంలో జగనన్న కాలనీల్లో అభివృద్ధి పనులు శరవేగంగా జరిగాయి. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేశారు. దెందులూరు నియోజకవర్గంలో ఏలూరు, పెదపాడు, పెదవేగి, దెందులూరు మండలాల్లోని 132 లేఅవుట్‌లలో తాగునీటి పైప్‌లైన్ల ఏర్పాటుకు రూ.605.74 లక్షల విడుదల చేసింది. ఈ పనులు పూర్తయితే 9,510 మంది కాలనీ లబ్ధిదారులకు మేలు జరుగుతుంది.

ఇంటింటికీ కుళాయి

జగనన్న కాలనీ భవిష్యత్తులో తాగునీరు సమస్య తలెత్తకుండా నాణ్యమైన పైప్‌లైన్ ప్రతి ఇంటికీ ముందు నుంచి వేసేలా ప్రణాళిక రచించారు. లబ్ధిదారుల ఇళ్లకు నేరుగా కుళాయి కనెక్షన్ అందించి తాగునీరు సరఫరా చేసేందుకు పనులు చేపట్టారు. ఏలూరు రూరల్, దెందులూరు, పెదవేగి, పెదపాడులో పలు కాలనీల్లో సుమారు 45 శాతం లబ్ధిదారులకు కుళాయి కనెక్షన్ అందించారు. ఎంఎన్‌ఆర్ ఈజీఎస్ నిధులు రూ.కోట్లు వెచ్చించి లేఅవుట్లను మెరక చేయించారు. ఎర్ర కంకరతో రోడ్లు వేసింది. ట్రాన్స్‌కో అధికారులు విద్యుత్ స్తంభాలు నిలబెట్టి వైర్లు నడిపారు. బోర్లు వేశారు. వీటన్నింటినీ ఒక్కొక్కటిగా కూటమి ప్రభుత్వం నిలిపేస్తోంది.


చాటపర్రులో ఇళ్లకు కనెక్షన్ ఇస్తున్న దృశ్యం


చాటపర్రు జగనన్న కాలనీలో పైప్‌లైన్ (ఫైల్)

జగనన్న కాలనీల్లో పైప్‌లైన్‌కు మంజూరైన నిధులు

మండలం	లే అవుట్లు	ఖర్చు రూ.లక్షల్లో	లబ్ధిదారులు
పెదవేగి	47	187.92	3451
పెదపాడు	45	210.26	3239
దెందులూరు	31	181.36	2114
ఏలూరు	9	26.2	697

పేదలకు అన్యాయం



కూటమి ప్రభుత్వం జగనన్న కాలనీలను నిర్వీర్యం చేయాలనే చూస్తోంది. చంద్రబాబు కొత్త ఇళ్ల మంజూరు చేయడం లేదు. ఇళ్లు లేకుండా అభివృద్ధి పనులు చేయవద్దని ఆదేశిస్తున్నారు. జగన్‌పై కక్ష సాధించాలని, పేదలను నష్టపోయేలా చేస్తున్నారు. జగన్ రూ.కోట్లు ఖర్చుపెట్టి కాలనీల్లో సౌకర్యాలు కల్పించారు.

– ముంగర సంజీవ్‌కుమార్, వైఎస్సార్ సీపీ నేత

నిలిచిన కొత్త పనులు



జగనన్న కాలనీల్లో పైప్‌లైన్ పనులు 50 శాతం దాటితేనే కొనసాగించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఇళ్లు నిర్మించుకుని కాలనీల్లో ఉంటున్న వారికి గతంలోనే పైప్‌లైన్ కనెక్షన్ ఇచ్చాం. ప్రభుత్వం జగనన్న కాలనీల్లో అభివృద్ధి పనులను సమీక్షిస్తుంది. ఇందులో భాగంగా కొత్త పనులు మంజూరు చేయడం లేదు.

– శ్రీకాంత్, అర్‌డబ్ల్యూఎస్ ఏఈ, ఏలూరు రూరల్

వేతన బకాయిలు చెల్లించాలి


ప్రభుత్వాసుపత్రి వద్ద సిబ్బంది నిరసన

ఏలూరు (టూటౌన్): బకాయి వేతనాలు చెల్లించాలని కోరుతూ శానిటరీ, సెక్యూరిటీ సిబ్బంది శుక్రవారం ఏలూరు ప్రభుత్వాసుపత్రివద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కె.కృష్ణమాచార్యులు డిమాండ్ చేశారు. ఏలూరు జిల్లాలోని ఏరియా హాస్పిటల్స్, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో ఐదు నెలలు జీతాలు కాంట్రాక్టర్ బకాయి పడ్డారని తెలిపారు. వెంటనే కాంట్రాక్టర్ జీతాలు చెల్లించాలని, నిధులు మంజూరు చేయాలని ప్రిన్సిపల్ సెక్రటరీకి లేఖ రాశామని వివరించారు. వారి నుంచి స్పందన లేకపోవడంతో జిల్లా వ్యాప్తంగా మూడు రోజుల నిరసన ప్రదర్శనలు ప్రారంభించామని చెప్పారు. తర్వాత సమ్మెకు కూడా వెళతామని కాంట్రాక్టర్‌ను హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి వి.దత్తాత్రేయ, సిబ్బంది విజయ, ఝాన్సీ సెక్యూరిటీ సూపర్‌వైజర్ మొబైల్ రాజు పాల్గొన్నారు.

23న సెమీ క్రిస్మస్

ఏలూరు (టూటౌన్): ఈ నెల 23వ తేదీన సాయంత్రం 6.30 గంటల నుంచి కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో హై–టీ (సెమీ క్రిస్మస్) వేడుక జిల్లా కలెక్టర్ కె.వెట్రి సెల్వి అధ్యక్షతన నిర్వహించనున్నట్టు జిల్లా మైనార్టీస్ సంక్షేమ అధికారి ఎస్ఎస్ కృపావరం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏలూరు జిల్లా మైనారిటీస్ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే సెమీ క్రిస్మస్‌కు ఏలూరులోని జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు, క్రిస్మస్ మత పెద్దలంతా తప్పక హాజరుకావాలని ఆయన కోరారు.

వ్యాధులపై అప్రమత్తత అవసరం

ఏలూరు (టూటౌన్): ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఏలూరు జిల్లా మలేరియా అధికారి పీఎస్ఎస్ ప్రసాద్ ప్రజలకు సూచించారు. ఏలూరు తంగెళ్లమూడి అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం యాదవ్ నగర్ ముట్ల కోనేరు ప్రాంతంలో ప్రజలకు ఫ్రైడే డ్రైడే కార్యక్రమం, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ప్రసాద్ మాట్లాడుతూ శీతాకాలంలో సీజనల్ వ్యాధులు సంభవించే అవకాశం ఉందని, వేడి వేడి ఆహార పదార్థాలు భుజించాలని, గోరువెచ్చని నీరు తాగాలని, చలి తగలకుండా ఉన్ని దుస్తులు వాడాలని సూచించారు. దోమల నివారణకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా డిప్యూటీ డీఎంహెచ్ఓ చక్రధర్ రావు, ప్రోగ్రాం ఆఫీసర్ రోహిత్, అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు పాల్గొన్నారు.


వ్యాధులపై ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

క్రీస్తు జననం.. ప్రతి ఇంటా ఆనందోత్సాహం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ప్రపంచ మానవాళి రక్షణ కోసం దేవుడు తనకుమారుడైన ఏసును ఈ లోకానికి పంపారని ఏలూరు పీఠాధిపతి, విశాఖ అగ్రపీఠ పాలనాధికారి బిషప్ పొలిమేర జయరావు అన్నారు. శుక్రవారం స్థానిక బిషప్ హౌస్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఏసు మానవాళికి పరిశుద్ధ మార్గాన్ని ప్రసాదించారని, ఆ మార్గంలో ప్రతి ఒక్కరూ పయనించాలని సూచించారు. క్రీస్తు జననంతో అందరి ఇంటా ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయని, చితికిన హృదయాలను, అణగారిన వర్గాలను ఆదరించడంలోనే సంతోషం ఉందని ఏసు స్పష్టం చేశారని గుర్తుచేశారు. ప్రేమ, క్షమ, శాంతి, కరుణ, దయలతో ప్రతి ఒక్కరూ జీవించాలని పోప్ ఫ్రాన్సిస్ ప్రార్థనలు చేయాలని వేడుకుంటున్నామని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనతో, ఐక్యతతో శాంతియుతంగా జీవించాలని పిలుపునిచ్చారు. ప్రజాప్రతినిధులకు, అధికారులకు, ప్రజలకు ఆయన క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. సోషల్ సర్వీస్ సెంటర్ డైరెక్టర్ టి.ఇమ్మానియేల్ మాట్లాడుతూ క్రిస్మస్ అంటే సాటి మనిషికి ఆనందం, సంతోషం ఇవ్వడమేనన్నారు. జాలిపూడి విచారణ కర్త ఫాదర్ తోట అంథోని మాట్లాడుతూ దేవుడు మానవుడుగా ఈ లోకానికి వచ్చింది మానవుడిని దేవునిగా చేయడానికేనన్నారు. సమావేశంలో ఏలూరు మేత్రాసనం కోశాధికారి ఫాదర్ రాజు, బేతంపూడి, జానంపేట విజ్ఞాన నిలయం ప్రెసిడెంట్ ఫాదర్ చిన్ని తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఏలూరు పీఠాధిపతి బిషప్ జయరావు

సదస్సుల్లో 2,729 అర్జీలు

ఏలూరు(మెట్రో): జిల్లాలో 254 గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులకు వచ్చిన 2,729 అర్జీల్లో 521 అర్జీలకు పరిష్కారం చూపామని జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి తెలిపారు. జిల్లాలో శుక్రవారం నిర్వహించిన 31 సదస్సుల్లో సమస్యలపై వచ్చిన 307 అర్జీల్లో 77 అర్జీలను పరిష్కరించామన్నారు. ఈ సదస్సుల్లో అందిన విజ్ఞప్తులను 45 రోజుల్లో పరిష్కరస్తామని జేసీ తెలిపారు. జనవరి 8వ తేదీ వరకు రెవెన్యూ సదస్సు నిర్వహిస్తామన్నారు.

షా వ్యాఖ్యలు రాజ్యాంగంపై దాడే

ఏలూరు (టూటౌన్): పార్లమెంటులో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమానిస్తూ హోం మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఏలూరు కొత్త బస్టాండ్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్ లింగరాజు, డీఎన్‌వీడీ ప్రసాద్‌లు మాట్లాడారు. బీజేపీ మొదటి నుంచి మనువాద రాజ్యాంగాన్ని తీసుకొచ్చే ప్రయత్నంలో భాగంగానే అంబేడ్కర్‌పై దాడి చేస్తుందని తెలిపారు. ఇది రాజ్యాంగంపై దాడిగా అభివర్ణించారు. తక్షణమే హోం మంత్రి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రజలందరిపైనా ఉందని అన్నారు. బీజేపీకి టీడీపీ, జనసేనలు తమ మద్దతును ఉపసంహరించుకోవాలని కోరారు. తొలుత సీఐటీయూ జిల్లా కార్యాలయం నుంచి కార్యకర్తలు ర్యాలీగా బస్టాండ్ వద్దకు వచ్చి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు నారపల్లి రమణారావు, కె.పోచమ్మ, ఎం దుర్గారావు, జి.రవికిషోర్, బి.సోమయ్య, ఎస్ రాంబాబు, కె.విజయలక్ష్మి, జి.గోపి, నండూరి హనుమాన్లు, తులసి, విమల తదితరులు పాల్గొన్నారు.


నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు, కార్యకర్తలు

23న ముసాయిదా పత్రాల దహనం

ఏలూరు (టూటౌన్): వ్యవసాయ మార్కెటింగ్ జాతీయ విధానం ముసాయిదా ఫ్రేమ్ వర్క్‌ను వెంటనే కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని, రైతుల ప్రయోజనాలు బలిపెట్టి కార్పొరేట్లకు లాభాలు కట్టబెట్టే చర్యలు ఆపాలని సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. ఏలూరు పవర్ పేటలోని అన్నే భవనంలో సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈనెల 23న సంయుక్త కిసాన్ మోర్చా దేశవ్యాప్త పిలుపు మేరకు వ్యవసాయ మార్కెటింగ్ జాతీయ విధానం ముసాయిదా పత్రాలను దహనం చేయనున్నట్టు నాయకులు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిన మూడు వ్యవసాయ నల్ల చట్టాలను తిరిగి తీసుకొచ్చేందుకు ప్రయత్నించడం దుర్మార్గమన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 246 ప్రకారం వ్యవసాయ మార్కెటింగ్ రాష్ట్ర పరిధిలో ఉందని తెలిపారు. వ్యవసాయ మార్కెట్లను రద్దు చేయడం కేంద్ర ముసాయిదా ఉద్దేశంగా ఉందని అభిప్రాయపడ్డారు. వ్యవసాయ కార్పొరేటీకరణ ఆపాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, బీకేఎంయూ జిల్లా అధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా నాయకులు రాజనాల రామ్మోహన రావు, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వి.శివ నాగ రాణి జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ మాట్లాడారు. తామా ముత్యాలమ్మ, గుడెల్లి వెంకటరావు, అందుగుల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.


ఐక్యతను చాటుతున్న నాయకులు

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	27
ఏలూరు –బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	38
ఏలూరు – బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	04
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	35

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు – బీహెచ్ఈఎల్	21.45	4820	20
ఏలూరు – బీహెచ్ఈఎల్	21.15	4822	24
ఏలూరు – బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	21
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	21
ఏలూరు–జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	30
ఏలూరు–బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	31
ఏలూరు – బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	29
ఏలూరు – ఈసీఐఎల్	22.30	4814	23
ఏలూరు – తిరుపతి	16.00	4830	34

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	20	అరటి కాయ (1)	06–08
వంకాయలు (గులాబీ)	34	చిక్కుడు కాయలు	60
వంకాయలు (కాంతులు)	56	బీన్లచిక్కుడు	80
వంకాయలు (తెలుపు)	44	చామదుంపలు	44
బెండకాయలు	40	ములక్కాడలు	10, 15
పచ్చిమిర్చి	28	కంద	60
కాకర కాయలు	34–40	బీట్‌రూట్	48
బీరకాయలు	30	కీరా దోస	44
బీరకాయలు (పందిరి)	44	ఫ్రెంచ్‌బీన్స్	76
క్యాబేజీ	30	అల్లం	70
క్యారెట్	36	కొత్తిమీర (కట్ట)	15
దొండకాయలు	44	పాలకూర	10
బంగాళదుంపలు	38	చుక్కకూర	10
ఉల్లిపాయలు	50	తోటకూర	10
గోరుచిక్కుడు	30	గోంగూర	07
దోసకాయలు	30	పుదీనా	05
ఆనబకాయ (1)	20–25	క్యాప్సికమ్	68
పొట్లకాయ(1)	20–25	చిలకడదుంప	36

84 భవనాలకు అనుమతులు

ఏలూరు (టూటౌన్): ఏలూరు కార్పొరేషన్ పరిధిలోని బిల్డింగ్ అనుమతులకు సంబంధించి పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించేందుకు ప్రతి శుక్రవారం బిల్డింగ్ యజమానులతో అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్టు కమిషనర్ ఎ.భానుప్రతాప్ తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా కార్పొరేషన్‌లోని టౌన్ ప్లానింగ్ కార్యాలయం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన అవేర్ నెస్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 2019 నుంచి 2024 మధ్య అనుమతుల కోసం దరఖాస్తు చేసుకుని వివిధ కారణాలతో ప్రొసీడింగ్స్ తీసుకోని వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఓపెన్ ఫోరమ్‌లో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. అసిస్టెంట్ సిటీ ప్లానింగ్ అధికారి డి.శ్రీనివాస్ మాట్లాడుతూ 2024 వరకు పెండింగ్‌లో ఉన్న బిల్డింగ్ అనుమతి దరఖాస్తులకు సంబంధించి తక్కువ సమయంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ సందర్భంగా 84 బిల్డింగ్‌లకు సంబంధించి అనుమతి ప్రొసీడింగ్స్‌ను సంబంధిత యజమానులకు అందజేశారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ జి.చంద్రయ్య, సాంబ, టౌన్ ప్లానింగ్ సిబ్బంది, భవన యాజమానులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న ఏసీపీ శ్రీనివాస్

ఎల్ఐసీని రక్షించుకుందాం

ఏలూరు (టూటౌన్): ఎల్ఐసీ సంస్థను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపైనా ఉందని ఎల్ఐసీ ఏఓఐ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి జి.రవికిషోర్ అన్నారు. ఎల్ఐసీ ఏవోఐ 21వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఏలూరు బ్రాంచ్–1 ఆఫీస్ వద్ద బ్రాంచ్ కన్వీనర్ కోడె రాంబాబు, యూనియన్ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రవికిషోర్ మాట్లాడుతూ ఎల్ఐసీని నిర్వీర్యం చేయడానికి ఐఆర్‌డీఏ తీసుకున్న ప్రతిపాదనలను వ్యతిరేకిస్తూ చేపట్టే చలో పార్లమెంట్ ధర్నాకు ఏజెంట్లంతా తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో సెంటర్ కమిటీ నాయకులు డీవీ రామకృష్ణ, జోనల్ నాయకులు బి.రామ్మోహన్‌రావు, డివిజన్ నాయకులు, బ్రాంచ్ నాయకులు పి.సాంబశివరావు, వైఎస్ కనకారావు, తాళం సురేష్, కట్టా సుబ్బారావు, జేఎస్ఆర్ చంద్రశేఖర్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు సుధాకర్, బ్రాంచ్ ఏబీఎం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



జెండా ఆవిష్కరణలో పాల్గొన్న ఏజెంట్లు, నాయకులు

చీరలు, సరుకుల పంపిణీ


పేదలకు చీరలు, నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): సౌత్ యూనివర్సిటీ (యూఎస్ఏ) సహకారంతో స్థానిక కొత్తపేట కృపా సహవాస సంఘం చర్చిలో సెమీ క్రిస్మస్ వేడుక నిర్వహించారు. కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. పాస్టర్ కె.క్రిస్టాఫర్ నేతృత్వంలో హేలపురి సైన్స్ అండ్ టెక్నాలజీ ఇంజినీరింగ్ కాలేజీ డైరెక్టర్ అరసవిల్లి అరవింద్ చారిటబుల్ ట్రస్ట్ తరపున 50 మంది పేదలకు చీరలు, బియ్యం, కందిపప్పు, ఆయిల్, నిత్యావసర సరుకులు పంపిణీ చేశామని ట్రస్ట్ చైర్మన్ అరసవిల్లి అరవింద్ తెలిపారు. ట్రస్ట్ ఇన్‌చార్జి షేక్ అయూబ్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి రంగారావుకు సతీ వియోగం


భ్రమరాంబ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న జయప్రకాష్

ఏలూరు (టూటౌన్): మాజీ మంత్రి మరడాని రంగారావు సతీమణి భ్రమరాంబ శుక్రవారం మృతి చెందారు. మంత్రి నివాసంలో ఆమె మృతదేహం వద్ద పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజలు, ప్రముఖులు నివాళులర్పించారు. మంత్రి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేవారు. వీరిలో పార్టీ ఏలూరు ఇన్‌చార్జి మామిళ్లపల్లి జయప్రకాష్ (జేపీ), మాజీ డిప్యూటీ మేయర్ గుడిదేశి శ్రీనివాస్, రాష్ట్ర బీసీ సెల్ నాయకులు కిలాడి దుర్గారావు, రాష్ట్ర ఎస్సీ సెల్ నాయకులు మున్నుల జాన్ గుర్నాథ్ తదితరులు ఉన్నారు.

కొనుగోలులో ప్రశ్నించేతత్వం అవసరం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ప్రతి వ్యక్తికీ వస్తువుల కొనుగోలు విషయంలో ప్రశ్నించే మనస్తత్వం ఉండాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జి.గిరిబాబు అన్నారు. కొవ్వలి వినియోగదారుల సేవామండలి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎకనామిక్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ వినియోగదారుల వారోత్సవాల్లో భాగంగా వినియోగదారుల హక్కులు బాధ్యతలపై, వినియోగదారుల చట్టం–2019పై వైస్ ప్రిన్సిపాల్ ఎం రాంబాబు అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథి కాన్ఫెడరేషన్ ఆఫ్ ఏలూరు డిస్ట్రిక్ట్ కన్స్యూమర్స్ అసోసియేషన్ (సెడ్కాస్) కన్వీనర్ కట్టా సత్యనారాయణ మాట్లాడుతూ వినియోగదారుడిగా నష్టపోతే వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్‌లో ఫిర్యాదు చేసి వస్తు సేవల ధరలు తిరిగి పొందవచ్చని అన్నారు. తెలివైన కొనుగోలు పద్ధతులు పాటించాలని విద్యార్థులకు సూచించారు. సెడ్కాస్ కో కన్వీనర్ సీపీఎస్ రామానుజాచార్యులు మాట్లాడుతూ తూనికలు కొలతల విషయంలో మోసం చేస్తే తూనికలు కొలతల శాఖ అధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాది ఎం జోసఫ్, కళాశాల అధ్యాపకులు ఎం విజయ్ కుమార్, ఎస్ సుస్యలత, ఎస్ పరమేశ, డి.సుజాత, టీవీఎస్ పద్మావతి, విద్యార్థులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న సెడ్కాస్ కన్వీనర్ సత్యనారాయణ